పేరు: నారా చంద్రబాబు నాయుడు

పుట్టినతేదీ: 20.4.1950
తల్లిదండ్రులు: అమ్మణ్ణమ్మ, ఖర్జూరనాయుడు
సతీమణి: నారా భువనేశ్వరి, **కుమారుడు:** నారా లోకేశ్
కోడలు: నారా బ్రాహ్మణి, **సొంతూరు:** నారావారిపల్లె, చంద్రగిరి
ఎమ్మెల్యేగా: 1978-83 చంద్రగిరి.. 1989 నుంచి ఏడుసార్లు కుప్పం నుంచి, మంత్రిగా: 1980-83 సినిమాటోగ్రఫీ శాఖ, 1994-95 ఆర్థిక, రెవెన్యూ శాఖ
సీఎంగా 14 ఏళ్లు: ఉమ్మడి రాష్ట్రంలో 1995- 2004, నవ్యాంధ్రలో 2014-19
ప్రతిపక్ష నాయకుడిగా 15 ఏళ్లు: 2004-14, 2019 నుంచి ఇప్పటివరకు.



పేరు: నూతన కాల్వ అమరనాథరెడ్డి

పుట్టిన తేది: 02.07.1959, **విద్యార్హత:** బీకాం
పదవులు: రెండుసార్లు సర్పంచి, ఓసారి డీసీసీబీ ఛైర్మన్
ఎమ్మెల్యేగా: పుంగనూరు నుంచి 1996-99, 2004-09... పలమనేరు నుంచి 2009-14, 2014-19
తండ్రి: రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే
తల్లి: తాయారమ్మ, మాజీ సర్పంచి
భార్య: రేణుకారెడ్డి
కుమారుడు: ప్రసేన్‌రెడ్డి
కోడలు: ప్రీతికారెడ్డి.



పేరు: గాలి భానుప్రకాష్

తండ్రి: గాలి ముద్దుకృష్ణమ నాయుడు, మాజీ మంత్రి
తల్లి: సరస్వతమ్మ, మాజీ ఎమ్మెల్సీ
కుటుంబం: భార్య శిరీష, ఇద్దరు కుమారులు, **పుట్టిన తేది:** 20.06.1976
విద్యార్హత: అమెరికాలోని బ్రిడ్జ్‌పోర్ట్ వర్సిటీలో ఎంఎస్
కుటుంబ నేపథ్యం: తండ్రి పుత్తూరు నియోజకవర్గం నుంచి ఐదుసార్లు, నగరి నుంచి ఓసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో విద్య, అటవీశాఖ మంత్రిగా పనిచేశారు. ఎమ్మెల్సీగా ఉంటూ మృతిచెందాక ఆయన భార్యకు ఎమ్మెల్సీ అవకాశం లభించింది.
పోటీ: 2019 ఎన్నికల్లో పోటీ చేసి 2818 ఓట్ల తేడాతో ఓడిపోయారు.



పేరు: వదింగాడు మునస్వామి (వీఎం) థామస్

పుట్టిన తేది: 28.06.1974
తల్లిదండ్రులు: రాణి, ప్రకాశం
భార్య: అనార్కళి రెడ్డి
పిల్లలు: రాహుల్, రోషన్
విద్యార్హతలు: పీహెచ్‌డీ ఇన్ బయోటెక్నాలజీ
వృత్తి: ఐవీఎఫ్ సైంటిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్టు.



పేరు: గురజాల జగన్మోహన్

పుట్టినతేదీ: 15.01.1983
తల్లిదండ్రులు: రజని, చెన్నకేశవులు నాయుడు
స్వగ్రామం: కోలావూరు, గుడిపాల మండలం
భార్య: ప్రతిమ
కుమారుడు : నితీష్ చౌదరి
సేవ: జీజేఎం ట్రస్టు పేరిట సేవా కార్యక్రమాలు చేస్తుంటారు.



ఐదు చోట్ల టీడీపీ అభ్యర్థులు

ఖరారు

- కుప్పం, పలమనేరు, జీడీనెల్లూరు, నగరిలో ఇప్పటికే ప్రకటన
- చిత్తూరుకు కొత్త అభ్యర్థి గురజాల జగన్మోహన్

ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ జోరు పెంచింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒకేసారి ఐదు చోట్ల ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేయడంతో సందడి ఊపందుకుంది. పూతలపట్టు, పుంగనూరు మినహా అభ్యర్థులు ఖరారయ్యారు. కుప్పం చంద్రబాబు, పలమనేరు అమరనాథరెడ్డి, జీడీనెల్లూరు డాక్టర్ థామస్, నగరి గాలి భానుప్రకాష్ విషయాల్లో ఇదివరకే స్పష్టత ఉండగా, చిత్తూరు అసెంబ్లీ స్థానానికి కొత్త అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను ప్రకటించారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



చిత్తూరు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గురజాల జగన్మోహన్



చిత్తూరులో టీడీపీ శ్రేణుల స్కూటర్ ర్యాలీ

పూతలపట్టు, పుంగనూరు సందిగ్ధం

చంద్రబాబు శనివారం ప్రకటించిన జాబితాలో పూతలపట్టు, పుంగనూరు అభ్యర్థులు లేరు. దీంతో ఆ రెండు చోట్ల సందిగ్ధత నెలకొంది. పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మురళీమోహన్‌ను గతేడాది ప్రకటించిన విషయం తెలిసిందే. గతేడాది ఆగస్టులో చంద్రబాబు పూతలపట్టులో భారీ బహిరంగ సభ కూడా నిర్వహించారు. ఇన్‌ఛార్జిగా ప్రకటించినప్పటి నుంచి మురళి కూడా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన విషయంలో మార్పులు ఉండకపోవచ్చని పార్టీ పెద్దలు అంటున్నారు. ఓ వైపు జనసేన, మరోవైపు బీజేపీ పొత్తు కారణంగా టీడీపీ అధిష్ఠానం అక్కడక్కడా కొన్ని సీట్లను ప్రకటించలేదు. ఈ క్రమంలోనే పుంగనూరు అభ్యర్థిని ప్రకటించకుండా వాయిదా వేసిందా అనే చర్చలు స్థానికంగా నడుస్తున్నాయి. ఇక పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మంత్రి పెద్దిరెడ్డితో నిత్యం పోరాడుతున్నారు. ఆయన పేరు ఎందుకు ప్రకటించలేదా అనే చర్చ కూడా నడుస్తోంది.

తండ్రిలాగే.. అందరికీ అందుబాటులో ఉంటూ..

నగరిలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడి పెద్ద కుమారుడు గాలి భానుప్రకాష్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. తన తండ్రి హయాంలోనే నియోజకవర్గంలోని శ్రేణులకు సన్నిహితంగా మెలిగారు. 2019లో అశోక్ రాజు, గాలి జగదీష్‌తో హోరాహోరీ పోటీ ఉన్నప్పటికీ అధిష్ఠానం చివరి దశలో గాలి భానుప్రకాష్‌ను ప్రకటించింది. 2800 స్వల్ప ఓట్ల తేడాతో రోజా చేతిలో ఓటమి చెందారు. అప్పటి నుంచి నియోజకవర్గంలోని శ్రేణులకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. తండ్రి తరహాలోనే నిరుపేదల ఇళ్లల్లో జరిగే కార్యక్రమానికీ హాజరై.. అన్ని వర్గాల నుంచీ ప్రత్యేక అభిమానాన్ని సంపాదించుకున్నారు. గత ఎన్నికల్లో త్రుటిలో తప్పిన విజయాన్ని ఈసారి మంచి మెజార్టీతో సాధించాలని శ్రేణులు ఈయన కోసం గట్టిగా పనిచేస్తున్నారు.

గురజాలకే అని ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

కీలకమైన జిల్లా కేంద్రం చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాలకు చిత్తూరు టికెట్ వస్తుందని ఆంధ్రజ్యోతి ముందే చెప్పింది. 'గురజాల జగన్మోహన్‌కు మెరుగైన అవకాశాలు' శీర్షికతో జనవరి 29న ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో కథనాన్ని ప్రచురించింది. 2019 ఎన్నికల తర్వాత ఏఎస్ మనోహర్ బయటికి వెళ్లిపోయినప్పటి నుంచి ఇక్కడ టీడీపీ ఇన్‌ఛార్జి పోస్టు ఖాళీగా ఉంది. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ వచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ చిత్తూరు టికెట్ కోసం విపరీతమైన పోటీ పెరిగింది. సీకే బాబు దంపతులు సహా డీకే కుటుంబం, కటారి హేమలత, చంద్రప్రకాష్, కాజూరు బాలాజీ, సీఆర్ రాజన్.. ఇలా చాలామంది తెరపైకి వచ్చారు. బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఆరు నెలల కిందట వచ్చిన గుడిపాలకు చెందిన గురజాల జగన్మోహన్ చిత్తూరు టీడీపీలో ఊపు తీసుకొచ్చారు. విద్య, వైద్య అవసరాల కోసం వచ్చినవారికి ఆర్థిక సాయంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు చేస్తూ తక్కువ సమయంలోనే వెలుగులోకి వచ్చారు. పోటీ మరీ ఎక్కువ కావడంతో దొరబాబు ఆరుగురు ఆశావహులతో బృందాన్ని ఏర్పాటుచేసి ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ చేసిన ఐవీఆర్ఎస్ సహా అన్నిరకాల సర్వేలో గురజాల జగన్ పేరు రావడంతో అతడి పేరును ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత అభిమానులు, టీడీపీ కార్యకర్తలు శనివారం మురకంబట్టు సర్కిల్ నుంచి దర్గా సర్కిల్ వరకు భారీఎత్తున ర్యాలీ చేశారు.

లక్ష మెజార్టీ లక్ష్యంతో

టీడీపీ అధినేత చంద్రబాబు 8వసారి కుప్పం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారు. 1989 నుంచి వరుసగా పోటీ చేసి గెలుస్తున్న విషయం తెలిసిందే. 2019 ఎన్నికల్లో మెజార్టీ తగ్గడంతో ఈసారి ఇక్కడ లక్ష మెజార్టీ లక్ష్యంగా టీడీపీ నాయకులు, శ్రేణులు పనిచేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అక్రమ ఏకగ్రీవాలు చేసుకోవడం, యాక్టివ్‌గా ఉండే టీడీపీ శ్రేణుల మీద తప్పుడు కేసులు వేధించడంతో నియోజకవర్గంలోని శ్రేణుల్లో కసి పెరిగింది. ఈసారి కచ్చితంగా తమ నాయకుడికి లక్ష మెజార్టీతో గెలిపించి బహుమతిగా ఇవ్వాలనే తలంపుతో పనిచేస్తున్నారు.

రాజకీయాలకు కొత్తయినా దూసుకుపోతూ..

జీడీనెల్లూరు నియోజకవర్గ అభ్యర్థిగా ఇప్పటికే ఇన్‌ఛార్జిగా ఉన్న డాక్టర్ థామస్‌ను ప్రకటించారు. వృత్తి రీత్యా ఫెర్టిలిటీ విభాగ వైద్యుడైన థామస్.. చంద్రబాబు పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చారు. ఈయన సొంతూరు కార్వేటినగరంలోని అల్లాగుంట గ్రామం కావడం, నియోజకవర్గంలో పిల్లలు లేని జంటలకు ఈయన ఫెర్టిలిటీ సెంటర్‌లో సంతాన భాగ్యం కలిగించడం వంటి కారణాలతో ఇక్కడి నాయకులకు, ప్రజలకు త్వరగా చేరువయ్యారు. థామస్‌ను గతేడాది జూన్ 1వ తేదీన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అధిష్ఠానం ప్రకటించడంతో అప్పటి నుంచి ఆయన విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇక్కడి ఎమ్మెల్యే నారాయణస్వామి దళితుల ఆత్మగౌరవాన్ని రెడ్ల వద్ద తాకట్టు పెట్టాడనే నినాదంతో ముందుకు వెళుతున్నారు. దీంతో పాటు వైసీపీ అధిష్ఠానం ఇక్కడ ఓసారి రెడ్డెప్ప అని, మరోసారి నారాయణస్వామి అని ప్రకటించింది. ఇప్పుడు పద్మజ అనే కొత్త పేరు ప్రచారంలో ఉంది. దీంతో వైసీపీ దళిత అభ్యర్థుల్ని అవమానిస్తోందని నియోజకవర్గ ప్రజలు విసిగిపోయారు.

ఇప్పటికే 'ఇంటింటికి టీడీపీ' పూర్తి

కుప్పం తరహాలోనే పలమనేరు అభ్యర్థి విషయంలోనూ ముందు నుంచీ క్లారిటీ ఉంది. ఇప్పుడు అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. 2019 ఎన్నికల్లో అమరనాథరెడ్డి ఓడిపోయినా, ఈసారి నాలుగు నెలలు ముందు నుంచే ఇంటింటికి టీడీపీ పేరుతో నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లారు. ప్రతి మండలంలోనూ ఆయన ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురు వలస వచ్చారు. ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు కూడా 2024 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని పనిచేస్తున్నారు. ఈయన జిల్లా టీడీపీకి పెద్దదిక్కుగా ఉంటూ, అభ్యర్థుల కసరత్తు విషయంలో రాయలసీమ కోఆర్డినేటర్‌గానూ వ్యవహరించారు. గతేడాది నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి జిల్లా దాటేవరకు లోకేశ్‌కు తోడుగా నడిచారు.



ప్రయాణికులకు ముఖ్య గమనిక

- రేపు శాంతిపురంలో సీఎం సభ
- బస్సు ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిదంటున్న విశ్లేషకులు

ప్రయాణికులకు ముఖ్య గమనిక. ఎవరైనా సోమవారం ప్రయాణాలు పెట్టుకుని ఉంటే.. వాయిదా వేసుకోవడమే మంచిది. లేదంటే బస్టాండ్లలో పడిగాపులు పడాల్సిందే. ఎందుకంటే శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో సీఎం జగన్ బహిరంగ సభ ఉంది. అత్యధిక బస్సులన్నీ అటువైపే వెళ్తాయి. రాష్ట్రంలో సీఎం జగన్ సభ అంటేనే ప్రయాణికులు బెంబేలెత్తే పరిస్థితి. పార్టీ సభ అయినా, ప్రభుత్వ కార్యక్రమమైనా నలుమూలల నుంచి జనాలను తరలించడం పరిపాటిగా మారింది. దీనికోసం ఆర్టీసీ, ప్రైవేటు, స్కూల్ బస్సులను ముందురోజే స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక స్కూళ్లకైతే సెలవు ప్రకటించాల్సిందే. ఇటీవల రాప్తాడు సభకూ ఆర్టీసీ బస్సులను మళ్లించడంతో రెండు రోజుల పాటు జిల్లాలోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సోమవారం శాంతిపురం మండలంలో సీఎం జగన్ సభ ఖరారైంది. దీంతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి, కడప జిల్లాల నుంచి సుమారు 900 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. అలాంటప్పుడు సాధారణ ప్రజలు ప్రయాణించేందుకు బస్సులు ఎక్కడుంటాయి? అందుకే ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిదంటున్నారు విశ్లేషకులు.

- చిత్తూరు రూరల్

నేడు గ్రూప్-2 పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 24: జిల్లాలో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు ఉదయం 9.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం లేటైనా అనుమతించేది లేదని అధికారులు స్పష్టంచేశారు. 9411 మంది అభ్యర్థులకోసం చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పూతలపట్టు ప్రాంతాల్లో 20 కేంద్రాల్లో 386 గదులు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నియంత్రణలో ఈ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షాకేంద్రాల్లోకి హాల్ టిక్కెట్, బాల్‌పెన్ మినహా ఇతర వస్తువులను అనుమతించబోమని కలెక్టర్ షన్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాడవీధుల్లో కూల్ పెయింట్

- కాణిపాక ఆలయ ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 24: వేసవిలో కాణిపాక ఆలయానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయడాలని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఆలయ సమావేశ మందిరంలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో పలు నిర్ణయాలను తీసుకున్నారు. వీటిని ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు మీడియాకు వెల్లడించారు. ఆలయంలోకి ప్రవేశించే సమయంలో భక్తుల కాళ్లు కాలకుండా ఉండేందుకు మాడవీధుల్లో కూల్ పెయింట్ వేయాలని నిర్ణయించారు. 2023-24 సంవత్సరానికి రూ.93 కోట్ల ఆదాయం రాగా అందులో 91 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. 2024-2025 రూ.117 కోట్లు రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఆదాయాన్ని ఖర్చు చేయడానికి దేవాదాయ శాఖ కమిషనర్‌కు అంచనాలు పంపి ఆమోదం వచ్చిన వెంటనే పనులు చేస్తామన్నారు. దినసరి కూలీలకు ప్రభుత్వ జీవో మేరకు ధరలను చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు గోపి, కాంతమ్మ, సుబ్బలక్ష్మమ్మ, జయశ్రీ, వెంకటరమణమ్మ, సుశీల, రామసుబ్బమ్మ, ప్రతిమ, ఎక్స్‌అఫిషియో మెంబరు సోమశేఖర్‌గురుకుల్, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.



గంజాయి ముఠా అరెస్టు

చిత్తూరు, ఫిబ్రవరి 24: చిత్తూరు నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా గంజాయి విక్రయించే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన నలుగురి నుంచి పది కిలోల గంజాయి, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను శనివారం సీఐలు ఉలసయ్య, విశ్వనాథరెడ్డితో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి మీడియాకు వివరించారు. గంజాయి అమ్మకంపై రెండో పట్టణ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు బాస్ హోటల్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. సంతపేట బ్రాహ్మణవీధికి చెందిన తులసీరామన్(26), ఐరాల మండలం మద్దిపట్లపల్లెకు చెందిన చరణ్‌కుమార్(22), తవణంపల్లె మండలం గాజులపల్లెకు చెందిన మాధవ(22), తేనెబండకు చెందిన కన్నా(36)ను అదుపులోకి తీసుకున్నారు. చిత్తూరు నగరానికి చెందిన పాండ్యా అనే స్మగ్లర్ వైజాగ్ ఏజెన్సీ ఏరియాలో గంజాయి కొని.. తమకు అమ్ముతున్నట్లు నిందితులు పోలీసుల విచారణలో ఒప్పుకొన్నారు. వీరు కొన్నేళ్లుగా గంజాయిని తీసుకొచ్చి అమ్ముతున్నట్లు విచారణలో తేలింది. వీరి నుంచి రూ.4.5 లక్షల విలువ చేసే పది కిలోల గంజాయిని, ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితులను రిమాండుకు పంపినట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గంజాయి విక్రయించి యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను తల్లిదండ్రులు కూడా గమనిస్తూ ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు లోనైనప్పుడు వారిని సన్మార్గంలో పెట్టడం తల్లిదండ్రుల బాధ్యతని గుర్తుచేశారు.



నిందితులు, గంజాయిని మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

ఎవరిని అడిగి చేశారిలా?

- సీఎం సభ వాహనాల పార్కింగ్‌కు లేఅవుట్‌లోని రాతికూసాల తొలగింపు
- అడ్డుకున్న స్థల యజమాని
- తర్వాత నాటిస్తామంటూ సర్ది చెప్పిన ఎస్ఐ



ఎస్ఎల్వీ కల్యాణ మండపం పక్కన లే అవుట్‌లో పనులను అడ్డుకుంటున్న స్థల యజమాని

శాంతిపురం, ఫిబ్రవరి 24: సీఎం జగన్ సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు లే అవుట్‌లో స్థలాలకు నాటిన రాతి కూసాలను తొలగించారు. ఎవరిని అడిగి ఇలా చేశారంటూ స్థల యజమానులు పనులను అడ్డుకున్నారు. శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో సోమవారం సీఎం సభ జరగనున్న విషయం తెలిసిందే. దీనికోసం శనివారం ఎస్ఎల్వీ కల్యాణ మండపం పక్కన గల లేఅవుట్‌లో స్థలాలకు నాటిన రాతి కూసాలను ఎక్స్‌కవేటర్‌తో కూలదోసి చదును చేసే పనులు చేపట్టారు. ఈ విషయం తెలిసి స్థలాల యజమాని, శివరామపురం మాజీ సర్పంచి భాస్కర్ అక్కడికి చేరుకుని ఎందుకు రాతి కూసాలను తొలగిస్తున్నారని అడిగారు. సీఎం సభకు వచ్చే వాహనాలను నిలిపేందుకంటూ అధికార పార్టీ నేతలు చెప్పడంతో చేస్తున్నామని అక్కడివారు తెలిపారు. 'ఎవరిని అడిగారు. స్థల యజమానులకు చెప్పారా? ఒక్కో రాతి కూసానికి రూ.800 ఖర్చు పెట్టి ఇంటి స్థలాలకు నాటుకుంటే మీ ఇష్టానికి కూలదోసి విరిచేస్తే నష్టపోయేది ఎవరు? ఇంటి స్థలాల హద్దులు మారిపోతే యజమానులు కొట్లాడుకోవాలా? విరిగిపోయిన కూసాలకు డబ్బులు ఎవరిస్తారు? సీఎం సభ ముగిసిన తరువాత ఎవరి పాటికి వారు వెళ్లి పోతారు. దీనికి బాధ్యులు ఎవరు' అంటూ మండిపడుతూ ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్నారు. సుమారు రెండు గంటల పాటు ఎవరూ రాలేదు. ఆ తర్వాత కొందరు అధికారులు అక్కడికి వచ్చి పరిశీలిస్తుండగా, వారి వద్దకు వెళ్లి స్థల యజమానులు ఇలా చేయడం న్యాయమా అంటు వాదనకు దిగారు. తమకు దీనికి సంబంధం లేదని, బస్సులు నిలుపు కోవడానికి స్థలం అడిగితే దీనిని చూపించారంటూ వారు వెళ్లి పోయారు. మరికొంతసేపటికి రాళ్లబూదుగూరు ఎస్ఐ సుమన్ అక్కడికి వచ్చి భాస్కర్‌కు సర్ది చెప్పారు. లేఅవుట్‌లోని రోడ్డు పక్కన ఉన్న స్థలాల యజమానుల అనుమతి తీసుకుని వాటికి నాటిన రాతి కూసాలను మాత్రమే తొలగించమని చెప్పారన్నారు. పని చేసే వారికి తెలియక లేఅవుట్‌లో ఉన్న రాతి కూసాలను తొలగించారని, వాటిని వెంటనే నాటించేస్తాను అంటూ సర్దిచెప్పి పంపించేశారు. లేఅవుట్‌లో స్థలాలు కొన్న పలువురు అక్కడి వచ్చి పరిస్థితిని చూసి ఆవేదన చెందారు.



అధికారులతో స్థల యజమానుల వాగ్వాదం



లేఅవుట్‌లోని స్థలాలకు నాటిన రాతి కూసాలను కూలదోశారిలా..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలం కబ్జా

అడ్డుకున్న సిబ్బందిపై దౌర్జన్యం ● సర్వేయర్ మాటలూ బేఖాతర్

కార్వేటినగరం, ఫిబ్రవరి 24: కార్వేటినగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని ఆక్రమించడానికి కొంతమంది స్థానికులు ప్రయత్నించారు. శనివారం నాలుగు కొయ్యలు నాటి ఆ స్థలం తమదంటూ బైఠాయించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూసా ప్రతిపాదనతో కొత్త పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కళాశాలలో విద్యార్థులకు నూతన భవనాలు, గతంలో శిథిలావస్థకు చేరుకున్న మూత్రవిసర్జనశాలలకు కొత్త నిర్మాణం చేపడుతున్నారు. కళాశాల పక్కనే కొంత మంది శనివారం కళాశాల స్థలంలో కొయ్యలు నాటి తమదంటూ బైఠాయించారు. సమాచారం అందుకున్న ప్రిన్సిపాల్, సిబ్బంది అక్కడికి చేరుకుని ఇది కళాశాల స్థలమని వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. వీరిపై వారు దౌర్జన్యానికి పూనుకున్నారు. ప్రిన్సిపాల్ సమాచారంతో సర్వేయర్ వచ్చి స్థలాన్ని కొలతలు వేశారు. ఆ స్థలం కళాశాలదేనని తేల్చి చెప్పారు. కళాశాల స్థలంలో ఇలా కబ్జాలు చేయరాదని, అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని వారికి చెప్పారు. వారికి ఎలాంటి సమస్య ఉన్న రెవెన్యూ అధికారులకు విన్నవించాలని కోరారు. ఇలా సర్వేయర్ చెప్పినా వాళ్లు పట్టించుకోకుండా అక్కడే బైఠాయించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గతంలోనూ కళాశాల ఆవరణలో ఉన్న చెట్లను కొట్టేయడంతో ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇకపై ఇలాంటి పొరపాట్లు చేయమని విన్నవించుకోవడంతో కేసు ఉపసంహరించుకున్నట్లు గుర్తుచేశారు.


అక్రమంగా వేసిన గుడిసెలు


ఆక్రమిత స్థలంలో సర్వే చేస్తున్న సర్వేయర్

తాగి పడేస్తున్నారు..!

● పంట పొలాల్లో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు
● ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బంది పడుతున్న రైతులు

చౌడేపల్లె, ఫిబ్రవరి 24: పొలాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు కొని.. గ్రామ సమీపాల్లోని పొలాల్లో తాగి పడేస్తున్నారు. వీరి చర్యతో పంట పొలాల్లో పడుండే టెట్రా ప్యాకెట్ల వ్యర్థాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. చౌడేపల్లె మండలం బత్తలాపురం గ్రామానికి చెందిన రైతు రెడ్డెమ్మకు గ్రామ సమీపంలో కొంత పొలం ఉంది. ఈ గ్రామ పరిసర ప్రాంతాల్లో కర్ణాటక మద్యం లభిస్తుండటంతో మందుబాబులు సమీప పంట పొలాలను అడ్డాగా చేసుకుంటున్నారు. నిత్యం కర్ణాటక మద్యం తాగి ఖాళీబాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు పంట పొలాల్లో పడేసి వెళ్తున్నారు. దీనివల్ల పంటల సాగుకు ఇబ్బందిగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెడ్డెమ్మతోపాటు చుట్టుపక్కల పొలాల్లోనూ ఎక్కడ చూసినా కర్ణాటక మద్యం ప్యాకెట్లే కనిపిస్తున్నాయి. కొందరు కూలీలను ఈ ప్లాస్టిక్ ప్యాకెట్లు ఏరిస్తున్నారు. అలాగే సాగుకు సిద్ధం చేస్తే ప్లాస్టిక్ మట్టిలో కలిసి భూసారం లోపిస్తుందని రైతులు అంటున్నారు. కర్ణాటక మద్యం విక్రేతలతోపాటు, పంట పొలాల్లో మద్యం తాగేవారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పొలంలో పడున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను ఏరుతున్న కూలీలు


బత్తలాపురం చెందిన రెడ్డెమ్మ పొలంలో టెట్రాప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ పాకెట్లు

కాణిపాకంలో పున్నమి గరుడ సేవ



ఐరాల(కాణిపాకం),ఫిబ్రవరి 24: కాణిపాకంలోని వరదరాజస్వామి ఆలయంలో శనివారం పున్నమి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం వరదరాజస్వామి మూల విరాట్‌కు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. అనంతరం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధులలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. గరుడుడిపై స్వామివారిని దర్శించుకునేందుకు వందలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కోదండరామస్వామి ఆలయానికి కలశం తీసుకెళ్తున్న పురోహితులు, అశోక్‌రాజు - ప్రత్యేకాలంకరణలో కోదండరామస్వామి

వైభవంగా కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకం

విజయపురం, ఫిబ్రవరి 24: విజయపురంలో శనివారం కోదండరామస్వామి ఆలయ మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. సిద్దార్థ గ్రూపు విద్యాసంస్థల ఛైర్మన్ కొండూరు అశోక్‌రాజు, ఇందిరవేణి దంపతుల ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిల్పి మోహన్, శిష్య బృందంచే శ్రీరామ, లక్ష్మణ, హనుమంత, లక్ష్మీ హైగ్రీవ విగ్రహాలను సిద్ధం చేసి అంకురార్పణ చేశారు. ఆలయ ఆవరణలో విగ్రహ ప్రతిష్ఠ, కలశపూజ, పూర్ణాహుతి, హోమం, పూర్ణ కుంభం, మహాసంప్రోక్షణ ప్రతిష్ఠ, అష్టబంధన, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది రాష్ట్రాల పురోహితులు, ఆలయ పురోహితుడు వందవాసి మహేశ్‌శర్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు: ఎస్పీ

చిత్తూరు, ఫిబ్రవరి 24: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రాకముందే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ జాషువా ఆదేశించారు. చిత్తూరులో శనివారం ఆయన మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల సరిహద్దులో జిల్లా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దుల్లో నిఘాతో పాటు నిత్యం వాహనాల తనిఖీ చేపట్టాలన్నారు. నాటుసారా తయారీ, విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు అరీఫుల్లా, నాగేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 24: ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా వృత్తి, విద్యాధికారి సయ్యద్ మౌల తెలిపారు. చిత్తూరులో శనివారం జరిగిన పరీక్షా కేంద్రాల చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలు కల్పించాలన్నారు. జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత, డీఈసీ సభ్యులు దయానందరాజు, డిస్ట్రిక్ బల్క్ ఇన్‌చార్జి అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై జేసీ వీడియో కాన్ఫరెన్సు

చిత్తూరు (సెంట్రల్)/చిత్తూరు, ఫిబ్రవరి 24: రామకుప్పం, శాంతిపురం మండలాల్లో సోమవారం జరిగే సీఎం పర్యటన నిర్వహణపై జేసీ శ్రీనివాసులు శనివారం అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జేసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. బహిరంగ సభ వద్ద గ్యాలరీ ఇన్‌చార్జిలకు కేటాయించిన గ్యాలరీల్లో అన్ని ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. ఐడీ కార్డులు, గ్యాలరీలో అవసరమైన తాగునీటిని సిద్ధంగా ఉంచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, డీఆర్వో పుల్లయ్య, డ్వామా, డీఆర్డీఏ పీడీలు రాజశేఖర్, తులసి, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ జేడీలు మురళీకృష్ణ, ప్రభాకర్, డీఈవో దేవరాజులు తదితరులు పాల్గొన్నారు. ఇక, సీఎం జగన్ పర్యటనపై పోలీసు అధికారులతో ఎస్పీ జాషువా సమావేశమయ్యారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా చందూరాణి



వెదురుకుప్పం, ఫిబ్రవరి 24: మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా ఎస్‌ఆర్‌పురం మండలం పిల్లిగుండ్లపల్లెకు చెందిన చందూరాణి నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్ఠానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 నుంచి ఆమె కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

అవ్వ ఇంటికి రాలేదని తాత ఆత్మహత్యాయత్నం

సోమల, ఫిబ్రవరి 24: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాలేదనే మనస్తాపంతో భర్త గుళికల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపారు. సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ తంగేళ్లమిట్టకు చెందిన చిన్నప్ప(60) భార్య మునెమ్మ భర్త మీద కోపంతో అలిగి పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో ఇంటికి రావాలంటూ భార్యను చిన్నప్ప కోరాడు. ఆమె అందుకు నిరాకరించింది. దీంతో ఆయన మనస్తాపం చెంది శనివారం మధ్యాహ్నం గుళికల మందు తిన్నాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో సదుం వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

28న పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 24: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించాలని డీఈవో దేవరాజు, జిల్లా సైన్స్ అధికారి రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి రెండు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయి నుంచి మూడు ప్రదర్శనలు జిల్లా స్థాయికి పంపాలన్నారు.

అట్టహాసంగా తిరుపతి జన్మదినం

ఇకపై ఏటా టీటీడీ నిర్వహిస్తుందన్న భూమన





ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగర 894వ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.గోవిందరాజస్వామి గుడి మాడవీధుల్లో వివిధ కళాబృందాల సందడి నడుమ ఉత్సవాన్ని ప్రారంభించిన టీటీడీ ఛైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ.. క్రీ.శ. 1130 ఫిబ్రవరి 24వ తేదీన గోవిందరాజ స్వామి విగ్రహప్రతిష్ఠ జరిగిందని, ఆ రోజే రామానుజాచార్యులు తిరుపతి పుట్టుకకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇకపై ఏటా తిరుపతి పుట్టిన రోజు వేడుకను టీటీడీ అధికారికంగా నిర్వహిస్తుందని, ఈ మేరకు టీటీడీ క్యాలెండర్లో పొందుపరచడానికి పాలక మండలి తీర్మానిస్తుందని ప్రకటించారు.ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో టీటీడీకి చెందిన ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టుకు చెందిన వందలాది కళాకారులు పాల్గొన్నారు. ప్రదర్శనగా సాగిన కోలాటాలు, చెక్కభజనలు, గోవింద నామ సంకీర్తనా బృందాలు నగరవాసులకు కనువిందుచేశాయి.టీటీడీ జీయర్ స్వాములు,ఈవో ధర్మారెడ్డి,కలెక్టర్ లక్ష్మీశా, ఎస్పీ మలిక గార్గ్, మేయర్ శిరీష, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి (కల్చరల్)



త్రిశూల స్నానం - పంచమూర్తుల ఊరేగింపు

వేదోక్తంగా త్రిశూల స్నానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24: కార్తీక శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తిలో ఏటి ఉత్సవం వైభవంగా జరిగింది.స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానాన్ని వేదోక్తంగా నిర్వహించారు. వారం రోజుల ముందు నుంచే ముక్కంటి ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయానికి పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో సద్యోముక్తి ప్రదేశాన్ని ముస్తాబు చేశారు. స్వామి అమ్మవార్ల మూల మూర్తులకు ఆలయంలో అభిషేకాలు నిర్వహించాక అలంకార మండపంలో పంచమూర్తులైన స్వామి, అమ్మవారు, వినాయక స్వామి, సుబ్రమణ్య స్వామి, చండీకేశ్వరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. భక్తుల శివనామ స్మరణ మధ్య సద్యోముక్తి ప్రదేశానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు.జీవుడు శివసాయుజ్యం పొందేందుకు ఆచరించాల్సిన సద్యోముక్తి వ్రతకల్పాన్ని వేద పండితులు వివరించారు.ముక్కంటి ఆలయ అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ కలశ స్థాపనతో సంకల్ప పూజలతో పాటు త్రిశూలానికి విశేష పూజలు చేశారు. నదీ జలంలో త్రిశూల స్నానం నిర్వహించేటప్పుడు భక్తులు పుణ్యస్నానాలాచరించారు.అనంతరం చతుర్మాడ వీధుల్లో పంచమూర్తుల ఊరేగింపు వేడుకగా జరిగింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మిద్దెల హరి, ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం కుమారధార తీర్థ ముక్కోటి ఘనంగా నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయానికి వాయవ్యదిశలో వెలసి ఉన్న కుమారధార తీర్థ ముక్కోటికి భక్తులు భారీగా తరలివచ్చారు. మాఘ మాసంలో పౌర్ణమి రోజున ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులను శనివారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తీర్థానికి అనుమతించారు. భక్తిశ్రద్ధలతో గోవిందనామస్మరణ చేసుకుంటూ తీర్థానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడ వెలసి ఉన్న కుమారస్వామిని దర్శించుకుని హారతులు సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీ పాపవినాశనం డ్యాం వద్ద అన్న ప్రసాదాలు, తాగునీరు ఏర్పాటు చేసింది. పటిష్ఠమైన భద్రత కల్పించారు.



పలమనేరులో బీజేపీ ప్రజా పోరుయాత్ర



పలమనేరు, ఫిబ్రవరి24 : బీజేపీ నాయకులు శనివారం పలమనేరులో ప్రజాపోరుయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్‌నాయుడు, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, పలమనేరు నియోజకవర్గ కన్వీనర్ జి.విజయ్‌కుమార్, పలమనేరు బీజేపీ కన్వీనర్ తాతాయ్యనాయుడు, పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, వి.కోట, మండల బీజేపీ అధ్యక్షులు మొగిలీశ్వర, శ్రీనివాసులు, ప్రభాకర్, వెంకటరమణ, సోమశేఖర్, బీజేపీ నాయకుడు శరవణకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర గవర్నర్‌కు ఎమ్మెల్సీ కంచర్ల లేఖ

కుప్పం, ఫిబ్రవరి 24: రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి జర్నలిస్టు శ్రీకృష్ణ, అలాగే ఈనాడు కార్యాలయంపై దాడులు చేసిన వైసీపీ గూండాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రాష్ట్ర గవర్నర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం గవర్నర్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, అరాచక ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని కోరారు. మరో 50 రోజుల్లో ఎన్నికలు రాబోతున్న తరుణంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ఎన్నికలను ప్రభావితం చేయడానికి వైసీపీ ప్రయత్నిస్తోందని ఎమ్మెల్సీ ఆరోపించారు.

'రాజధాని ఫైల్స్' చూడాల్సిన సినిమా : అమర్



పలమనేరు, ఫిబ్రవరి24 : రాజధాని ఫైల్స్ సినిమా రాష్ట్రప్రజలందరూ తప్పక చూడాల్సిన సినిమా అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం పలమనేరులోని రంగమహల్‌లో రాజధానిఫైల్స్ సినిమాను ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి తిలకించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని ఎంత అవసరమో రాజధానిఫైల్స్ సినిమా చూస్తే అందరికీ అర్థమవుతుందన్నారు. రాజధాని కోసం రైతులు తమ భూములను ఇచ్చిన సందర్భాన్ని గుర్తుచేయడం, వైసీపీ ప్రభుత్వం చేసిన కుట్రలు, కుతంత్రాలు ఈ సినిమా ద్వారా రాష్ట్ర ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేశారన్నారు. ఆచన వెంట ఆర్వీ బాలాజీ, రామచంద్రనాయుడు, ఆర్బీసీ కుట్టి, జనసేన నాయకులు ఉన్నారు.

మామిడిలో సస్యరక్షణ చేపట్టండి

సోమల, ఫిబ్రవరి 24: పూత దశలోని మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవనశాఖ అధికారిణి సంతోషికుమారి సూచించారు. శనివారం మండలంలోని సోమల, అడుసుపల్లె, ఇరికిపెంట పరిధిలో మామిడి తోటలను ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తోటల్లో తేనె మంచు పురుగు ఉధృతంగా ఉన్న నేపథ్యంలో బుప్రోఫెజిన్ 1.5 మి.లీ, హెక్సాకోనోజోల్ 2 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పూత వచ్చిన తోటల్లో తేలికపాటి తడి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు మామిడి రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయండి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24: ఈనెల 27న తిరుపతిలో జరిగే ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఎమార్పీఎస్ కన్వీనర్ నరసింహులు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు వెంకటరమణమాది, బున్న, అమరనాథ్, గోవిందు, శ్రీరాములు, శ్రీనివాస్, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

27న భీమగానిపల్లెలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24: భీమగానిపల్లెలోని భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ఈనెల 27న ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 27న ఉదయం గణపతి పూజ, పూర్ణవాహచనం, వాస్తుశాంతి, ధ్వజారోహణం, 28న పంచగవ్యం, రక్షాబంధనం, కలశారాధన, అగ్నిప్రతిష్ఠ, జలాదివాసం, 29న నిత్యహోమం, మహాపూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, రాత్రి వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు అందుకోవాలని కోరారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు



రామకుప్పం, ఫిబ్రవరి 24 : పట్టణంలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. సాయంత్రం అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు.

తిరుమల కాలినడక భక్తులకు అన్నదానం



కల్లూరు, ఫిబ్రవరి 24: పులిచెర్ల మండలం దేవళంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి కర్ణాటక రాష్ట్రం నుంచి తిరుమలకు వెళుతున్న కాలినడక భక్తులకు రాష్ట్ర కుమ్మరి శాలివాహన సేవా సంఘం కన్వీనర్ గురుస్వామి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం నంగలి సమీపంలోని ముస్తూరు గ్రామానికి చెందిన సుమారు 200మంది భక్తులు ప్రతి ఏడాది స్వగ్రామం నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో మార్గమధ్యలోని దేవళంపేటలో బస చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు చంద్రబాబు, మల్లికార్జున, రెడ్డిప్రసాద్, మునికృష్ణ, మునితేజ, కర్ణాటక భక్తుల బృందం నాయకులు శ్రీనివాసులు, సుబాష్, వెంకట్రాయప్ప, నాగరాజు, అర్చకులు అనంతకుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల ప్రారంభం



వి.కోట, ఫిబ్రవరి 24: ఎమ్మెల్యే వెంకటేగౌడ శనివారం వి.కోట మండలం పెద్దభరిణపల్లె, ముదరందొడ్డి, ఎస్.బండపల్లె గ్రామాల్లో పర్యటించారు. కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లను, గ్రామసచివాలయాలను ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ తమీంఖాన్, నేతలు పీఎంనాగరాజు, భూపతి, రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, దామోదర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

సోమల, ఫిబ్రవరి 24: సోమల మండలం పాతూరుకు చెందిన శతాధిక వృద్ధురాలు పర్వతాల కృష్ణమ్మ (110) మృతి చెందడంతో శనివారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు జరిపారు. గత పదేళ్ల వరకు కృష్ణమ్మ వ్యవసాయ పనులు చురుగ్గా చేసేదని గ్రామస్తులు తెలిపారు.

కోలాహలంగా కాశీవిశ్వేశ్వరస్వామి రథోత్సవం



పలమనేరులో నిర్వహించిన బ్రహ్మరథోత్సవం

పలమనేరు, ఫిబ్రవరి24 : పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బ్రహ్మరథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం శివపార్వతులను రథంపై పూలమాలలతో అలంకరించి వందలాది మంది భక్తులు పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చుతూ బ్యాండుమేళాల మధ్య బ్రహ్మరథోత్సవాన్ని ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గంటే వీరభద్ర, ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ సిబ్బంది విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి లేట్ మునినారాయణశెట్టి, ఆలయ కమిటీ చైర్మన్ గంటేవీరభద్ర, న్యాయవాది పి.పరమశివప్ప, పి.శ్రీనాథ్, దేవస్థాన మాజీ చైర్మన్ టీకే షణ్ముగం, ఏఎస్ఆర్ మండి నిర్వాహకులు సులోచన, శంకరెడ్డి దంపతులు, లేట్ మునివెంకటప్ప శెట్టి అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. పట్టణానికి చెందిన ఇంజినీర్ ఫయాజ్ తన బృందంతో కలిసి భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, నీళ్లబాటిళ్లు అందజేశారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



రథంలో ఊరేగుతున్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవర్లు, రథోత్సవంలో పాల్గొన్న భక్తజన సందోహం

వి.కోట, ఫిబ్రవరి: వి.కోట పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. మధ్యాహ్నం సర్వాలంకార శోభితంగా అలంకరించిన అమ్మవార్లు, స్వామి వారి ఉత్సవర్లను రథంలో వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య అధిష్ఠింపజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథాన్ని పట్టణవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా దేవతామూర్తులకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. రథం ముందు కోలాటలు, పండరి భజనలు, మంగళవాయిద్యాలతో పట్టణం మొత్తం ఆధ్యాత్మికతను సంతరించుకుంది.

తాగునీటి సమస్యపై కౌన్సిలర్ల ఆందోళన

పలమనేరు, ఫిబ్రవరి24 : పలమనేరులో తాగునీటి సమస్య రోజురోజుకు పెరుగుతోందని, ఇప్పటికే కౌండిన్య రిజర్వాయర్‌లో నీరు ఒట్టిపోయిందని, వేసవిలో తాగునీటిపై ఏం చర్యలు తీసుకొంటారని పలువురు కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిలర్ శారద మాట్లాడుతూ తమ గ్రామం గొబ్బిళ్లకోటూరుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని పలు సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా నేటివరకు మరమ్మతులు గానీ, కొత్త రోడ్డు వేయడం గానీ చేయలేదన్నారు. దీనిపై ఇంజినీరింగ్ శాఖ అధికారి మాట్లాడుతూ రోడ్డువేసేందుకు టెండర్లు వేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని సమాధానం ఇచ్చారు. వేసవి ముంచుకొస్తున్న వేళ ఇప్పటికే మూడు రోజులకొకసారి తాగునీటి సరఫరా చేస్తున్నారని, ఇకపై ఐదు రోజులకు ఒకసారి నీరు ఇస్తామని చెబుతున్నారని కౌన్సిలర్లు హైదర్, కిరణ్‌కుమార్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలో ఉన్న చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని కూడా మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట్ల కొత్తబోర్లు వేయడం, ట్యాంకర్లతో నీటి సరఫరా వంటి చర్యలు తీసుకొంటామని చెప్పారు. అనంతరం రూ. 223.70 లక్షల పనులకు సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఆర్ఓ రవిరెడ్డి, మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, ఇంజినీరింగ్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ-నీవా పనులు పూర్తి

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి

రామకుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 24: గతంలో కుప్పం పర్యటనకు వచ్చిన సందర్భంగా సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ-నీవా కుప్పం కెనాల్ పనులు తమ ప్రభుత్వం పూర్తి చేసిందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం వారు రామకుప్పం మండలం రాజుపేట, శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెల్లో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ హంద్రీ-నీవా కుప్పం కెనాల్ ద్వారా నియోజకవర్గంలోని 54చెరువులకు నీరందించే అవకాశముందన్నారు. సీఎం జగన్ కుప్పానికి హంద్రీ-నీవా జలాలను విడుదల చేయడమే కాకుండా, పాలారు ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేస్తారన్నారు. తద్వారా కుప్పం నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యలు దూరమవుతాయన్నారు. అదేవిధంగా కుప్పంలో గాండ్ల కమ్యూనిటీ భవనానికి భూమిని ప్రభుత్వం కేటాయించిందని, రూ.3కోట్లతో భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. వారి వెంట ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టరు శ్రీనివాసులు, డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఉపాధి కల్పనే బీసీఎన్ విద్యా సంస్థల లక్ష్యం

కుప్పం, ఫిబ్రవరి 24: ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా బీసీఎన్ విద్యా సంస్థల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు ఆ సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. కుప్పం డిగ్రీ కళాశాల 14వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తమ డిగ్రీ కళాశాలలో అన్నిరకాలైన బోధనా సదుపాయలు ఉన్నాయని చెప్పారు. కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని,భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరచచిన విద్యార్థులకు ప్రమాణపత్రాలు అందజేశారు. నటుడు, స్టాండప్ కమెడియన్ హేమంత్ పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.కార్యక్రమంలో కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సీఈవో సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డి.సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న బీసీ నాగరాజ్ తదితరులు

మహిళలకు అండగా నిలిచింది టీడీపీనే..

రామకుప్పం, ఫిబ్రవరి 24: అనాదిగా లింగవివక్షకు గురైన మహిళలకు అండగా నిలిచింది టీడీపీనేనని ఆపార్టీ యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, మాజీ ఉపసర్పంచు గంట్లరెడ్డి, తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు పద్మమ్మ, సీనియర్ నేత అలివేలు మంగమ్మలు తెలిపారు. శనివారం రాత్రి రామకుప్పం మండలం కెంపసముద్రంలో నిర్వహించిన మహిళా గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక మహిళా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. దీని గమనించిన చంద్రబాబు ఈ సారి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, 18ఏళ్ళు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థికసాయం అందించాలని నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో నేతలు కోదండరెడ్డి, మునిరత్నం, జయమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



కెంపసముద్రంలో మహిళా గృహ సారథులతో టీడీపీ నేతలు

ఘనంగా కాళభైరవేశ్వరుడి కల్యాణం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 24 : మండలంలోని కుప్పనపల్లె గ్రామ సమీపంలో వున్న కాళభైరవేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాఘ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు మురళీధరా చార్యులు, శంకరశర్మ స్వామివారికి విశేషాలంకరణచేసి ప్రత్యేకపూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి గాయత్రి, సుభాష్, శారద, వన్నెగౌడ, కృష్ణప్ప, రఘుగౌడు, భైరప్ప, వెంకటేష్, తిప్పన్న ఉభయదారులుగా వ్యవహరించారు.



కాళభైరేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భక్తులు

మసెమ్మ జాతర ప్రారంభం



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24: అరడిగుంట పంచాయతీ కొండచెర్ల కురప్పల్లె గ్రామస్తులు శనివారం మసెమ్మజాతరను వైభవంగా ప్రారంభించారు. గ్రామ దేవతలైన కుంటిగంగమ్మ, ధనకుంట గంగమ్మ, బోయకొండ గంగమ్మ, నడివీధి గంగమ్మలకు తొలుతగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పపల్లకిలో మసెమ్మను కొలువుతీర్చి గ్రామవీధుల్లో బళ్లారిడ్రమ్ములు, మేళతాళాలు, నృత్యాలు, పిల్లనగ్రోవి, చెక్కభజనలు, కర్రసాము తదతర కార్యక్రమాల మధ్య అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు, జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లరుజామున అమ్మవారిని భక్తుల దర్శనార్థం ఉంచుతారు. చుట్టుపక్కల 30గ్రామాల ప్రజలు జాతర జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

శివపార్వతుల కల్యాణం



సదుం, ఫిబ్రవరి24: పాలమంద పంచాయతీ జంగంపల్లెలో వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం తిరునాళ్లలో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను రాత్రి పుష్ప పల్లకిపై ప్రత్యేక అలంకరణతో అధిష్ఠించి ఊరేగించారు. పరిసర ప్రాంతాల ప్రజలు స్వామి, అమ్మవారిని పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

చెన్నకేశవస్వామికి విశేష పూజలు

సోమల, ఫిబ్రవరి 24: సోమల సమీపంలో ఉన్న చెన్నయ్యగారిపల్లెలో కొలువుతీరిన చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం స్వామికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణలు చేశారు. అర్చకులు అభిషేకపూజలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సోమల, నడింపల్లె, కరకమంద, దిడ్డివారిపల్లె, గన్నావారిపల్లె భక్తులు మొక్కులు తీర్చుకుని ప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ జెండా ఆవిష్కరణ

గుడుపల్లె, ఫిబ్రవరి 24: మండలంలోని అలుగుమానుపల్లెలో టీడీపీ జెండాను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం వస్తేనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కుటుంబానికి ఆర్థిక సాయం

శాంతిపురం, ఫిబ్రవరి 24 : మండల పరిధి వెంకటేపల్లెలోని టీడీపీ కుటుంబానికి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి ఎల్.జయరామిరెడ్డి తదితరులు రూ.10,000 ఆర్థిక సహాయం చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ బూత్ ఇన్‌చార్జి సద్దాం హుసేన్ అమ్మ షాతూబీ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతికి అంజలి ఘటించారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం



శాంతిపురం, ఫిబ్రవరి 24 : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద నాల్గవ రోజైన శనివారం అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. సుమారు 300 మంది పేదలకు అన్నం పెట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు

డిగ్రీ అడ్మిషన్ల కోసం ప్రచారం

పలమనేరు, ఫిబ్రవరి24 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రానున్న విద్యాసంవత్సరంలో డిగ్రీ అడ్మిషన్ల కోసం శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలతోపాటు, ఆట స్థలం, స్కిల్‌హబ్, ఎన్‌సీసీ, కంప్యూటర్ ల్యాబ్, సైన్సుల్యాబ్, ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ శిక్షణ పొందిన అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారని వివరించారు.కార్యక్రమంలో భౌతిక, రసాయనశాస్త్ర అధ్యాపకులు జి.ఎం.షణ్ముగం, వెంకటాద్రి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సోమల, ఫిబ్రవరి 24: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఎంఈవో శివరత్న కోరారు. శనివారం సోమల, కందూరు హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులను కలసి రాబోవు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. టీవీలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అలాగే కందూరు హైస్కూల్‌లో సాయంత్రం ప్రత్యేక తరగతులను సందర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగరాజ, వెంకట్రమణారెడ్డి, షకీల్, సీఆర్పీలు పాల్గొన్నారు.

రామకుప్పంలో డీసీసీబీ శాఖ ప్రారంభం

రామకుప్పం, ఫిబ్రవరి 24: పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన డీసీసీ బ్యాంకు శాఖను శనివారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు వారు మిట్టపల్లె వద్ద నిర్మించిన ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టరు శ్రీనివాసులు, డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురం బాబు, చంద్రారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వేణుగోపాల్ గౌడు, తహసీల్దారు శ్రీధర్ పాల్గొన్నారు.

గాండ్ల కమ్యూనిటీ భవనానికి భూమి పూజ

కుప్పం, ఫిబ్రవరి 24: కుప్పం-గుడుపల్లె మండలాల సరిహద్దు గుండ్లసాగరం సమీపంలో శనివారం గాండ్ల కమ్యూనిటీ భవన నిర్మాణానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ భవన నిర్మాణంకోసం ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. కుప్పంలో గాండ్ల కులస్తులకు కేటాయించిన మూడు ఎకరాల స్థలంలో ఈ నిర్మాణం సాగుతుందన్నారు. రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమంలో గాండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ భవానీ ప్రియ, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లాకు కాంస్య పతకం


కాంస్య పతకాన్ని సాధించిన చిత్తూరు జిల్లా కబడ్డీ జట్టు

చిత్తూరు క్రీడలు, ఫిబ్రవరి 24: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో చిత్తూరు జిల్లా బాలుర జట్టు మూడో స్థానాన్ని కైవసం చేసుకొని కాంస్య పతకాన్ని సాధించిందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు మమత, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న జిల్లా బాలుర జట్టు మూడో స్థానాన్ని సాధించింది. వీరు త్వరలో బిహార్ రాష్ట్రం, పాట్నాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాలొంటారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం వెలికితీయాలి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 24: విద్యార్థుల్లో దాగియున్న శాస్త్రీయ నైపుణ్యాన్ని వెలికి తీయాలని విద్యాశాఖ ఏడీ విజయేంద్రరావు పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ఎక్స్‌పో 2024 జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీ మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలు ఇలాంటి ప్రదర్శనల్లోనే బయటకి వస్తాయన్నారు. అనంతరం గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఈఎండీపీ మేనేజర్ అనిత, డీఎస్వో రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లెగూడేనికి బయలుదేరిన ఆలయ ప్రచార రథం


ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న చైర్మన్, ఈవో

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 24: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రచారం రథం శనివారం తాడేపల్లెగూడేనికి బయలు దేరి వెళ్లింది. ఉదయం ప్రధాన ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయస్వామి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చి ప్రచారరథంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. అనంతరం ప్రచార రథం బయల్దేరి వెళ్లింది.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, ఫిబ్రవరి 24: ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించి భక్తులకు దర్శనం గావించి స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరణ గావించి మేళతాళాల నడుమ ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పౌర్ణమి సందర్భంగా విచ్చేసిన భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవ మంటపం ప్రారంభం


ఉత్సవ మంటపాన్ని ప్రారంభిస్తున్న గిరిప్రదక్షణ నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 24: గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా నిర్మించిన గిరిప్రదక్షణ ఉత్సవ మంటపాన్ని నిర్వాహకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో లక్ష హోమపూజాది కార్యక్రమాలు నిర్వహిచారు. అనంతరం మాఘ పౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవార్లకు పౌర్ణమి గిరిప్రదక్షణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గిరి ప్రదక్షణ నిర్వాహకులు పూలసుబ్రమణ్యం నాయుడు, డాక్టర్ ఎస్‌టి. రంగనాథన్ కుటుంబ సభ్యులు, పార్థసారథి నాయుడు, కార్పొరేటర్ ఇందు, డిప్యూటి మేయర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రాముడి కల్యాణం



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 24: స్థానిక కోదండ రామాలయంలో శనివారం సాయంత్రం మాఘ మాస పౌర్ణమి సందర్భంగా స్వామివారికి పూల వర్తకుడు పాండు దంపతుల ఉభయంతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్‌తో పాటు పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, అక్షింతలు, తలంబ్రాలను పంపిణీ చేశారు.

చిన్నముస్తిరికుప్పంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

గుడిపాల, ఫిబ్రవరి 24: మండలంలోని గట్రాళ్ళమిట్ట పంచాయతీ చిన్నముస్తిరికుప్పం గ్రామంలో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నిటినీ దశలవారీగా నెరవేరుస్తారన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఆర్ముగం, సురేష్ యాదవ్, చంద్రబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయలలిత జయంతి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 24: స్థానిక ఎంజీఆర్ వీధిలో శనివారం తమిళనాడు మాజీ సీఎం, ఏఐఏడీఎంకే అధినేత్రి దివంగత జయలలిత జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అన్నాడీఎంకే రాష్ట్ర డిప్యూటీ సెక్రటరి ఎస్.ఎ. రవూఫ్ బక్కర్ ఆధ్వర్యంలో జయలలిత చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏఐఏడీఎంకే నగర నాయకులు తిరునావుకరసు, సుబ్రమణ్యం, కోదండన్, జయకుమార్, రాజశేఖర్, బీడాబాబు, మాసిలామణి, సంతానం, రాజా, అన్సర్, నవాజ్, వినాయకం తదితరులు పాల్గొన్నారు.

నగరి: నగరి పట్టణ పరిధిలోని కొత్తపేట వద్ద తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఏఐఏడీఎంకే కార్యదర్శి డా. అంబ్రూస్ విల్సన్ ఆధ్వర్యంలో జయలలిత, ఎంజీఆర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముత్తుకుమార్, గోపి, శేఖర్, పలువురు ఏఐఏడీఎంకే నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, ఫిబ్రవరి 24: మండలంలోని అంబేడ్కర్ సర్కిల్‌లోని అన్న క్యాంటీన్‌లో శనివారం ఐరాల మండలం మద్దిపట్లపల్లికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ ఎం.ఎన్. చౌదరి, ఎం.ఎన్. ప్రనీత్, దేవాన్ష్ చౌదరిలు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, ఏకాంబరం, హరి, వీరభద్రయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద వున్న అన్నక్యాంటీన్‌లో శనివారం తూంపాయనపల్లికి చెందిన నరసింహా నాయుడు మనవరాలు కావ్య జన్మదినాన్ని పురస్కరించుకుని భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ నాయుడు, జనార్దన్ గౌడ్, కిషోర్, మణికంఠేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

నగరి, ఫిబ్రవరి 24: మండలంలో అవర్‌లేడీ ఆఫ్ మెర్సీ ప్రైవేటు పాఠశాలను ఎంఈవో నమఃశివాయ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్ కరెక్షన్, పాఠశాలలో పాఠ్య బోధన విధానాన్ని పరిశీలించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కాణిపాకంలో కొబ్బరికాయలు కొడుతున్న జగన్మోహన్




చిత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు, బాణసంచా కాలుస్తున్న కార్యకర్తలు, నగరిలో స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న టీడీపీ నాయకులు

టీడీపీ అభ్యర్థుల ప్రకటనపై పార్టీ శ్రేణుల సంబరాలు

- మురకంబట్టు నుంచి చిత్తూరు అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ
- అనుమతి లేదంటూ అడ్డుకున్న పోలీసులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 24: చిత్తూరు, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లను పార్టీ అధిష్ఠానం శనివారం ప్రకటించడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ● చిత్తూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిని ప్రకటించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎమ్మెల్యే అభ్యర్థుల తొలిజాబితాను ప్రకటించారు. అందులో చిత్తూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గురజాల జగన్మోన్‌ను ప్రకటించారు. దీంతో పార్టీ శ్రేణులు మురకంబట్టు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మురకంబట్టు వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు గురజాల జగన్మోహన్‌కు భారీ స్వాగతం పలికారు. మురకంబట్టు సర్కిల్ లోని డీకే ఆదికేశవులు విగ్రహానికి గురజాల జగన్మోహన్ పూలమాల వేసి నివాళులర్పిచారు. అనంతరం ద్విచక్రవాహనాలు, కార్లలో ర్యాలీగా వచ్చి మహాత్మ జ్యోతీరావ్ పూలే, మహాత్మ గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు గాంధీ విగ్రహం వద్ద టీడీపీ నేతల వాహనాలను అడ్డుకున్నారు. అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహిస్తే కేసులు నమోదుచేస్తామని పోలీసులు హెచ్చరించారు. వైసీపీ నేతల ర్యాలీలకు అనుమతిస్తూ టీడీపీ నేతల ర్యాలీలను అడ్డుకోవడం న్యాయం కాదని గురజాల జగన్మోహన్ పోలీసులతో వాగ్వివాదం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సుబ్రమణ్యం నాయుడు, త్యాగరాజన్, హేమాద్రి నాయుడు, వరుణ్ కుమార్, అశోక్, అనిల్, శేషాద్రి నాయుడు, ఆనంద్, యువరాజులు నాయుడు, జాఫర్, నిత్య ఉదయ్, గోపి, రాణి, వరలక్ష్మి, ఆర్ఎస్ నాయుడు, అన్వేష్, రాజేష్, పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో చిత్తూరు టీడీపీ అభ్యర్థి

ఐరాల(కాణిపాకం): చిత్తూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను టీడీపీ నాయకులు నరసింహులు నాయుడు, ఆలయ బోర్డు మాజీ సభ్యుడు మదన్ ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేష్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

గుడిపాల: గురజాల జగన్మోహన్ నాయుడును చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ ప్రకటించడంతో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, వసంతాపురం ఎంపీటీసీ విజయలక్ష్మి జయదేవ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీటీసీ సాంబశివ నాయుడు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు ఎస్సీసెల్ అధ్యక్షుడు పీటర్, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఉదయ, నాయకులు మురళీ నాయుడు, రఘునాథ నాయుడు, గోపి, రవి నాయుడు, చల్లా పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో..

వెదురుకుప్పం: గంగాధరనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి జాబితాలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ వీఎం థామస్‌ను ప్రకటించడంతో శనివారం వెదురుకుప్పంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. టపాకాయలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు పి.మోహన్‌మురళీ, చెంగల్రాయరెడ్డి, నాయకులు వెంకటరమణారెడ్డి, వెంకటేశ్, వరప్రసాద్, మొగిలయ్య, శంకర్, రామకృష్ణారెడ్డి, శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, జనసేన పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకులు రాజశేఖర్ నాయుడు, దేవరాజులు నాయుడు, దాము, హేమాద్రి యాదవ్, జనసేన నాయకులు చిరంజీవి, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాలసముద్రం: పాలసముద్రం టీడీపీ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులు టపాకాయలు పేల్చి, ర్యాలీ నిర్వహించారు. థామస్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని, టీడీపీదే విజయం అంటూ నినాదాలు చేశారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు, నాయకులు జె. విజయ్‌కుమార్, తంగరాజ్, అరుణ్‌నాథన్, సాంబశివన్, ఉమాపతి, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: పెనుమూరు బస్టాండులో టీడీపీ శ్రేణులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. మండల పార్టీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, పంగులూరి కిషోర్, పసుపులేటి రమేష్, సురేష్ నాయుడు, భాస్కర్ నాయుడు, రాజేష్, రాజగోపాల్ నాయుడు, పూలశేఖర్, శ్రీనివాస చౌదరి, జనసేన మండల అధ్యక్షులు శ్రీనివాసులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండల తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్వేటినగరం మండలానికి చెందిన డాక్టర్ థామస్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని అన్నారు. మండల టీడీపీ అధ్యక్షులు చెంగల్‌రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు నాగేశ్వరరాజు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి జనార్ధన్‌రాజు హర్షం వ్యక్తం చేశారు.

నగరి నియోజకవర్గంలో...

నగరి: నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గాలి భానుప్రకాష్‌ను పార్టీ అధినేత చంద్రబాబునాయుడు శనివారం ప్రకటించడంతో నగరి టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టవర్‌క్లాక్ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాణసంచా పేల్చి, నినాదాలు హోరెత్తించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, జిల్లా కార్యదర్శి రుక్కుం బాలాజీ, ఎస్సీసెల్ కార్యదర్శి అల్లిముత్తు, సంపత్, నాయకులు వాసు, కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతి నాయుడు, సురేష్ నాయుడు, నారాయణస్వామి నాయుడు, పురుషోత్తమ నాయుడు, నాగరాజు, సలీం, ఖాదర్‌బాయ్, నూరుల్లా, ఆర్ముగం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నింద్ర: నింద్ర మండల టీడీపీ నాయకులు టపాకాయలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. భానుప్రకాష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు బాబుయాదవ్, రమేష్, మురళీ నాయుడు, పరదేశి, జగన్, మహేష్, సంపూర్ణమ్మ, గాలి రమేష్ నాయుడు, మణిరెడ్డి, ఏలు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: మండల కేంద్రమైన విజయపురం, పన్నూరు, పన్నూరు సబ్‌స్టేషన్, కోసలనగరం, మహారాజపురం, ఇళ్ళత్తూరు, పాతార్కాడు, నారపరాజుకండ్రిగలో మండల టీడీపీ నాయకులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు, మునిభాస్కర్‌రాజు, కపిల్, అశోక్, శరత్, మురళీనాయుడు, కొండూరు దామోదర్ రాజు, శేఖర్, పరంధామనాయుడు, శ్రీనివాసులురాజు, సెల్వం తదితరులు పాల్గొన్నారు.


గుడిపాలలో మహిళలు, నాయకుల హర్షం


వెదురుకుప్పంలో టీడీపీ శ్రేణుల సంబరాలు


శ్రీరంగరాజపురంలో...


పాలసముద్రంలో...


పెనుమూరులో



నింద్రలో, విజయపురంలో టీడీపీ నాయకుల సంబరాలు

రెండు లారీలు ఢీ... తప్పిన పెనుప్రమాదం

- తరచూ ప్రమాదాలు... పట్టించుకోని హైవే అధికారులు


ప్రమాదంలో నుజ్జయిన లారీ

గుడిపాల, ఫిబ్రవరి 24: చిత్తూరు - వేలూరు, బెంగుళూరు - చెన్నై జాతీయ రహదారిలోని గోపాలపురం వద్ద శనివారం రెండు కంటైనర్ లారీలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే లారీ నుజ్జునుజ్జయ్యింది. హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత మూడ్రోజులుగా రెండు కార్లు, లారీలు ఢీకొని ఇప్పటికే ముగ్గురు తీవ్రంగా గాయపడి సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 190 రామాపురం సీఎంసీ వద్ద హైవే రోడ్డు పనులు చేపడుతుండటంతో రెండు పక్కల వెళ్లాల్సిన వాహనాలను ఒకవైపే పంపుతుండటంతో అక్కడ సరైన సూచిక బోర్డులు లేకపోవడంతో ఒకే రహదారిలో వాహనాలు వెళ్తూ వస్తుండటంతో రోజుకో ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

మద్యం స్వాధీనం: నలుగురి అరెస్టు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 24: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగరాజరావు తెలిపారు. పోలీసుల కథనం మేరకు పాలేరు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా చిత్తూరు రామ్‌నగర్‌కాలనీకి చెందిన అమీర్, షమీ ఉల్లాఖాన్, మొహమ్మద్ షరీఫ్, అజీమ్‌లు కర్ణాటక మద్యంతో పట్టుబడ్డారు. వీరి వద్ద 1097 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పూతలపట్టు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రవిప్రసాద్ దరఖాస్తు

తవణంపల్లె, ఫిబ్రవరి 24: పూతలపట్టు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసినట్లు తవణంపల్లె మండలం పుణ్యసముద్రం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రవిప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో తాను ఎంపీపీగా పని చేశానని, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని పేర్కొన్నారు.

ఐటీ ఉద్యోగుల ర్యాలీ

చిత్తూరు, ఫిబ్రవరి 24: వివిధ ప్రాంతాల్లో ఐటీ ఉద్యోగులుగా పనిచేస్తున్న పలువురు శనివారం విజయానందరెడ్డికి మద్దతుగా కార్ల ర్యాలీ నిర్వహించారు. నగర మేయర్ అముద, తిమ్మసముద్రం రవిచంద్రారెడ్డి, వైసీపీ నగర అధ్యక్షులు టిమ్ము, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాహుల్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రామగణేష్, కార్పొరేటర్లు జ్ఞాన జగదీశ్, నారాయణ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పాలసముద్రం, ఫిబ్రవరి 24: మండలంలోని బాలక్రిష్ణాపురం నుంచి తమిళనాడులోని పొన్నైకి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి వీఆర్వో శంకర్ పట్టుకొని పాలసముద్రం పోలీసులకు అప్పగించారు. తమిళనాడులోని పెద్దనాయనిపల్లి గ్రామానికి చెందిన పవన్‌కుమార్ గత కొన్నిరోజులుగా బాలక్రిష్ణాపురం మీదుగా తమిళనాడుకు ఇసుక రవాణా చేస్తుండగా, వీఆర్వో శంకర్ ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి, ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

సీతాయాశ్చరితమ్.... సశ్శీలతకు సందేశం: చాగంటి


డాక్టర్ భువనేశ్వరి మైనపు విగ్రహాన్ని ప్రారంభిస్తున్న చాగంటి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 24: రామాయణంలో సీతచరిత్ర కేవలం శీలవతి అనే అంశం కాదని, సశ్శీలత, సౌజన్యత, నిబద్ధత, నిజాయతీ, నిర్మోహమాటం తదితర అంశాలకు సీతాయాశ్చరితమ్ నాంది అని ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఉద్బోధించారు. స్థానిక కొంగారెడ్డిపల్లె - గురునగర్ కాలనీ ఆర్.కె. మోడల్ పాఠశాలలో గత మూడురోజులుగా ప్రముఖ ప్రవచకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు నిర్వహిస్తున్న సీతాయాశ్చరితమ్ (సీతమ్మకథ) ప్రవచనాలు శనివారం సాయంత్రంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన ప్రవచనాలు చేస్తూ సీతను మనం శీలవతిగా భావించడం కంటే ఆ మహాసాధ్వి యొక్క గుణగుణాల్లో చెప్పవలసినది నిబద్ధత ప్రధానమైన అంశం అని తెలిపారు. ఈ సందర్భంగా సీతాయాశ్చరితమ్‌లో సీత యొక్క గుణగణాలను నేటి యువతీ యువకులు, దంపతులు అనుసరిస్తున్న పలు విషయాలను అన్వయించి ఉపదేశించారు. అంతకు మునుపు అరవిందో సొసైటీ నిర్వాహకులు డాక్టర్ నరేంద్రకుమార్ సతీమణి దివంగత ప్రసూతి వైద్యురాలు భువనేశ్వరి మైనపు విగ్రహాన్ని కొంగారెడ్డిపల్లె బాబు నర్సింగ్‌హోంలో చాగంటి ఆవిష్కరించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలో రాఘవన్, రమణ, రామ్మూర్తి, వీరభద్రరావు, పురాణ పండిట్ రామ్మూర్తి, ఆయిల్ వరదయ్య, పలువురు పుర ప్రముఖులు, నగరవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కట్టమంచి సేవలు మరువరానివి

- సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణకుమార్


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అతిథులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 24: ఆదర్శనీయుడు, దార్శనికుడు, విద్యావేత్త, బహుభాషవేత్త కట్టమంచి రామలింగారెడ్డి అని జిల్లా సీనియర్ జడ్జి ఐ కరుణకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మ్యాంగోభవన్‌లో శనివారం సీఆర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కట్టమంచి రామలింగారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌రెడ్డి ట్రస్టు సభ్యులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ చిత్తూరు ముద్దుబిడ్డ అయిన కట్టమంచి విద్యావేత్తగా, రాజకీయ కోవిదుడిగా బహుముఖ సేవలు అందించారన్నారు. కట్టమంచి - సాంబయ్యకండ్రిగ రోడ్డుకు నగరపాలక అధికారులు కట్టమంచి నామకరణం చేయడం పట్ల డాక్టర్ నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. స్థానిక బి.వి. రెడ్డి కాలనీలోని సీఆర్‌రెడ్డి సమాధికి జడ్జితో పాటు సభ్యులందరూ నివాళులు అర్పించారు. విశ్రాంత తెలుగు ఆచార్యుడు వి. హరి నాయుడు, హరివిల్లు సభ్యుడు బి.మునస్వామి, ఎం.వి.శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్, బివీరెడ్డి, బాబి తదితరులు పాల్గొన్నారు.

ట్రయల్ ఈవీఎం రాండమైజేషన్‌పై అవగాహన

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 24: అసెంబ్లీ, పార్లమెంటు సెగ్మెంట్ల వారీగా ఈవీఎంలను కేటాయించేందుకు జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధుల సమక్షంలో ట్రయల్ ఈవీఎం మొదటి రాండమైజేషన్‌పై అవగాహన నిర్వహించనున్నట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో డీఆర్వో పుల్లయ్యతో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఆర్వోలు మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి 4708 బ్యాలెట్ యూనిట్లు, 4226 కంట్రోల్ యూనిట్లు, 5082 వీవీ ప్యాట్లు వచ్చాయన్నారు. ర్యాండమైజేషన్‌పై డిప్యూటీ తహసీల్దార్లకు ఈడీఎంలు, ఎలక్షన్ డీటీలు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఈవీఎంలపై శిక్షణ ఇచ్చామన్నారు. మొదటి యాదృచ్ఛిక ఈవీఎంల జాబితా నియోజకవర్గాల వారీగా జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు వెంకటశివ, భవానీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రీనివాసులు (బీజేపీ), భాస్కర్, పరదేశి (కాంగ్రెస్), భాస్కర్ (బీఎస్పీ), గంగరాజు (సీపీఎం), ఉదయ్‌కుమార్ (వైఎస్సార్‌సీపీ), ప్రభుతేజ (టీడీపీ), ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యస్వామి కల్యాణం



గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 24: మండలంలోని వింజం పంచాయతీ సిద్దేశ్వరకొండ గ్రామంలోని కొండపై గల ఆలయంలో వళ్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వారి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామి, అమ్మవార్ల ప్రధాన విగ్రహాలకు అర్చకులు అభిషేకం పూజలు చేశారు. అనంతరం పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించగా, భక్తులు కనులవిందుగా వీక్షించారు.అనంతరం శనివారం రాత్రి ఉత్సవమూర్తులను పల్లకిలో అధిరోహింపజేసి పురవీధుల్లో మేళాతాళాల మధ్య ఊరేగించారు.

ఘనంగా యాంటీ డ్రగ్స్ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 24: డ్రగ్స్, మాదక ద్రవ్యాలను నిషేధించి యువత సన్మార్గంలో పయనించాలి అని నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జాన్ శామ్యూల్ కిమ్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌నుంచి 'స్టూడెంట్స్ ఎన్‌లైటిల్మెంట్ ర్యాలీ ఫర్ యాంటీ డ్రగ్స్' ర్యాలీని నిర్వహిచారు. ఈ ర్యాలీ పీసీఆర్, ఎంఎస్ఆర్, రాజీవ్‌గాంధీరోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యార్థులచే నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్. జోబ్, బి. మదులేటి, విజయ్‌కుమార్, ప్రియ, ఢిల్లీబాబు, అరుణ్‌కుమార్, రాజు, సుజాత, శివాని, గంధం శ్రీనివాస్, ఎంజల్, అనూష తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు బీరువాల వితరణ


పార్థసారథి నాయుడును సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 24: నగరంలోని ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలకు నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు శనివారం సుమారు రూ.50 వేలు విలువ చేసే మూడు బీరువాలను వితరణ చేశారు. అనంతరం పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం ఆయన్ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

బస్ షెల్టరు ప్రారంభం

విజయపురం, ఫిబ్రవరి 24: మండలంలోని ఎల్లసముద్రం, పన్నూరు ఆదిఆంధ్రవాడలో బస్ షెల్టరును శనివారం మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. పన్నూరు దళితవాడలో భూ రక్ష పథకం కింద జగనన్న భూ హక్కు పత్రాలను, పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో బ్రహ్మయ్య, తహసీల్దార్ మల్లికార్జునరావ్, సర్పంచ్ మమతాశ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

గుడిపాల, ఫిబ్రవరి 24: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదుగుతారని సీఎన్ఆర్ కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్, విశ్రాంత తెలుగు అధ్యాపకుడు బి. మునస్వామి అన్నారు. శనివారం సీఎన్ఆర్ కళాశాలలో వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు మాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

కార్వేటినగరం, ఫిబ్రవరి 24: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శనివారం భక్తులకు అన్నదానం చేశారు. అన్నదానం చేసేందుకు దాతలు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు.